www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -86 శుక్రవారం 10 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## విశాఖలో కియా ఎక్స్‌పోర్ట్ సెంటర్

శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్.. కొరియాలో లోకేశ్ కీలక భేటీలు

దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్

శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి

ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన

కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి



2లో

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా కల

**2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించటమే లక్ష్యం**

**గాంధీ స్ఫూర్తితో యంగ్ ఇండియా పేరుతో విశ్వవిద్యాలయం**

**స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగో ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్ జూలై 9:(ప్రజావినికిడి):** 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించటం నా కల. అందుకే హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగోలు, నమూనాలను భారత ఒలింపిక్ ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి. ఉషతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.మిగతాది 2లో...



## బంధం మరింత బలోపేతం

ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు

ఇరు దేశాల మధ్య కీలకమైన అణు సహకార ఒప్పందం ఖరారు

ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన ఇరు దేశాల ప్రధానులు

రక్షణ, వాణిజ్యం, విద్య, కీలక ఖనిజాలపై విస్తృత చర్చలు

ఈ బంధం ఎన్నడూ లేనంత కీలకం అన్న ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

2లో

## ధాన్యం కొనుగోలులో రికార్డు

**వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు**

**పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ,జూలై 9:(ప్రజావినికిడి):** గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు పక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు.మిగతాది 2లో...



## బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు

**ఈ అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలి**

**సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్లేది లేదు**

**'సింగరేణి బావి బాట'లో భాగంగా కొత్తగూడెంలో కల్వకుంట్ల కవిత పర్యటన**

**కొత్తగూడెంజూలై 9: (ప్రజావినికిడి):** బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు పంచాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు., తన కంఠంలో ప్రాణం ఉండగా బీఆర్ఎస్‌లోకి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సింగరేణి బావి బాట' కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కవిత పర్యటించారు. ఉదయం కొత్తగూడెం ఏరియాలోని ఫైవ్ షాఫ్ట్ గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యాప్యాలస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సింగరేణి కోసం తాను ఉద్యమంలో, ప్రభుత్వంలో పనిచేశాననీ,మిగతాది 2లో...



## మూసీ ప్రాజెక్టు మొదటి దశకు ప్రభుత్వం అనుమతి

**రూ. 7,345 కోట్లతో జోన్-1 పనులకు గ్రీన్‌సిగ్నల్**



**హైదరాబాద్‌జూలై 9: ((ప్రజావినికిడి):** మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు మొదటి దశకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.7,345 కోట్లతో జోన్-1 పనులు చేపట్టేందుకు అనుమతినిచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ఏసియా డెవలంప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) రూ.4,500 కోట్ల రుణం ఇస్తోంది. ఆ నిధులతో బోర్డు మిగతాది 2లో...

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

**దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్,జూలై 9:(ప్రజావినికిడి):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మిగతాది 2లో...



# పరిశ్రమలకు ఓఆర్ఆర్ బయట భూములు

**ఇండియాస్ నెక్స్ట్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్**

**దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు**

**తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు**

**హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు**

**హైదరాబాద్,జూలై9(ప్రజావినికిడి):** 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్ట్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది,మిగతాది 2లో...



## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

**సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో కెసిఆర్ నిర్ణయం**

**హైదరాబాద్,జూలై 9: (ప్రజావినికిడి):** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధ్యలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.



# బంధం మరింత బలోపేతం

## ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు

**మెల్‌బోర్న్ జూలై 9: (ప్రజావినికిడి):**
భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధం ఎంత వేగంగా, ఎంత పటిష్ఠంగా ఉందో ప్రధాని నరేంద్ర మోదీ క్రికెట్ పోలికలతో చక్కగా వివరించారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా జరుగుతాయని, ఈ భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత లోతైనదని, పటిష్ఠమైనదని ఆయన అభివర్ణించారు.
మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియాలో పర్యటన ముగించుకుని నిన్న మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధాని మోదీ, ఇవాళ అల్బనీస్‌తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా వ్యూహాత్మక, ఆర్థిక, భద్రతా రంగాల్లో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.
ప్రపంచ క్రీడా రాజధానిగా పేరుగాంచిన మెల్‌బోర్న్‌లో, రెండు దేశాలను కలిపే 'దౌత్య భాష' క్రికెట్ అని మోదీ అన్నారు. "మా సమావేశాలు ఒక క్రికెట్ మ్యాచ్ లాంటివి. మా ఎజెండా వన్డే ఇంటర్నేషనల్ అంత స్పష్టంగా ఉంటుంది. మా నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా ఉంటాయి. మా భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత శాశ్వతమైనది, లోతైనది" అని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.
ఈ సదస్సులో ఒక చారిత్రాత్మక అణు సహకార ఒప్పందం కుదరడం అత్యంత కీలక పరిణామం. ఇది ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త కోణాన్ని ఇచ్చింది. దీంతో పాటు ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ తీవ్రంగా ఖండిస్తూ ఇరు దేశాధినేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్, సిడ్నీలోని బాండీ బీచ్‌లో ఇటీవల జరిగిన దాడులను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉగ్రవాద నిర్మూలనకు సమాచార మార్పిడి, ఆన్‌లైన్ తీవ్రవాదంపై పోరాటం, ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రవాద సంస్థలు, వాటి నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడంలో సహకరించుకోవాలని ఇరు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి.
ఈ చర్చల్లో యురేనియం సరఫరా, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, కీలకమైన ఖనిజాలు, విద్య, క్రీడా మౌలిక సదుపాయాలు, ప్రజల మధ్య సంబంధాలు వంటి అనేక ఇతర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి పెద్ద క్రీడా ఈవెంట్లను ఇరు దేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా రంగంలో సహకారంపై కూడా దృష్టి సారించారు.
ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు 'ఎన్నడూ లేనంత కీలకమైనవి' అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అభివర్ణించారు. మోదీ-అల్బనీస్ నాయకత్వంలో ఆర్థిక వృద్ధి, సాంకేతికత, వ్యూహాత్మక సవాళ్లపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ఈ పర్యటన ప్రతిబింబిస్తోంది. పర్యటనలో భాగంగా మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం కానుండటం గమనార్హం.

# ధాన్యం కొనుగోలులో రికార్డు

**(మొదటి పేజీ తరువాయి)**
కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్‌ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా కల

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'గత 10 ఏండ్లుగా తెలంగాణకు క్రీడా విధానం లేదు. ఓ పాలసీ లేకుండా ప్రభుత్వం, అధికారులు ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. అందుకే, మా ప్రభుత్వం వచ్చిన రెండేండ్లలో స్పోర్ట్స్ పాలసీ రూపొందించాం. 20 ఏండ్ల కిందటే ఆఫ్రో ఏసియా, ప్రపంచ మిలటరీ గేమ్స్‌కు ఆతిథ్యం అందించిన చరిత్ర హైదరాబాద్‌కు ఉంది. కానీ గత ప్రభుత్వ హయాంలో స్టేడియాలను పెండ్లిలకు, విందులకు ఇతర వేడుకలకు అద్దెకు ఇవ్వటం దురదృష్టకరం. స్వేచ్ఛ కోసం పోరాడేందుకు మహాత్మా గాంధీ యంగ్ ఇండియా పత్రికను నడిపారు. ఆ స్ఫూర్తితోనే క్రీడా విశ్వవిద్యాలయానికి యంగ్ ఇండియా పేరు పెట్టాం.క్రీడల్లో రాణించేందుకు పాలసీలు, శిక్షణ, అకాడమీలు, విశ్వవిద్యాలయం అవసరం. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. అప్పుడు హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించటం నా కల. 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించగల అథ్లెట్లను తయారు చేసేందుకు తెలంగాణ చిత్తశుద్ధితో పని చేస్తోంది. క్రీడల్లో రాణించిన నిఖత్ జరీన్, ఇషా సింగ్, మహ్మద్ సిరాజ్, దీప్తి జీవాంజిలకు ప్రభుత్వ ఉద్యోగాలు అందించాం. క్రీడలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. 2028లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను' అని అన్నారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడల




సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.భారత్‌లో, తెలంగాణలో బలమైన స్పోర్ట్స్ కల్చర్‌కు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు అతిపెద్ద అడుగు అని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష అన్నారు. 'ఓ అథ్లెట్‌గా చెబుతున్నాను.. మనకు మంచి క్రీడాకారులతో పాటు మంచి కోచ్‌లు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ ఎంతో అవసరం. ఫిజికల్ ఎడ్యుకేషన్, పారా స్పోర్ట్స్‌పై దృష్టి నిలుపుతున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు. ఈ యూనివర్శిటీ నుంచి కోచ్‌లు, రిఫరీలు, అడ్మినిస్ట్రేటర్లు తయారు కావాలి. యంగ్ ఇండియా స్పోర్ట్స్ ఫెలోషిప్ ప్రవేశపెట్టడం అభినందనీయమని' పిటి ఉష తెలిపారు.

**నగదు ప్రోత్సాహకాలు అందజేత**

అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన తెలంగాణ క్రీడాకారులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పారా అథ్లెట్, పారిస్ పారాలింపిక్స్ మెడలిస్ట్ దీప్తి జీవాంజికి రూ.50 లక్షలు, షూటర్ ఇషా సింగ్‌కు రూ.3.30 కోట్లు, పారా షూటర్ ధనుశ్ శ్రీకాంత్‌కు రూ.2.10 కోట్లు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.60 లక్షలు, తనీశ్‌కు రూ.53 లక్షలు, సురభి భరద్వాజ్‌కు రూ.10 లక్షల చెక్‌లు అందించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయశ్ రంజన్‌తో పలు కంపెనీలు ప్రతినిధులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పారా అథ్లెట్ల ప్రతిభాన్వేషణకు ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు.

## మూసీ ప్రాజెక్టు మొదటి దశకు ప్రభుత్వం అనుమతి

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రూ.2,845 కోట్లు హెచ్ఎండీఏ లేదా టీజీఐఐసీ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జోన్-1ఏలో హిమాయత్‌సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,104 కోట్లతో 9.20 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. జోన్-1బీలో ఉస్మాన్ సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,950 కోట్లతో 11.80 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి ఎంఆర్‌డీసీఎల్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ భూములు, ప్రయివేటు భూములతో కలిపి మొత్తం రెండు వందల ఎకరాల్లో బాపూఘట్ త్రివేణి సంగమం వద్ద 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు'ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇటీవల గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ 83 ఎకరాలను ఇచ్చింది. అక్కడే గాంధీ సమాధి, మ్యూజియం నిర్మించనుంది. వంద మీటర్ల ఎత్తయిన టవర్, దానిపై 30 మీటర్ల గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుంది. అందులో ఎడ్యుకేషన్ నాలెజ్జి హబ్, ధ్యాన మందిరం, నేషనల్ మ్యూజియం, పబ్లిక్ రిక్రియేషన్ స్పెసెస్, గాంధీ యూనివర్సిటీ, చేనేత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. మొదటి దశ మూసీ ప్రాజెక్టు 21 కిలో మీటర్లు పూర్త చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## పరిశ్రమలకు ఓఆర్ఆర్ బయట భూములు

యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

# బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

**(మొదటి పేజీ తరువాయి)**
బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్

**విజయవాడ,జూలై 9: (ప్రజావినికిడి):**



ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు.సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

# పీఓకేలో పతాకస్థాయికి ఉద్రిక్తతలు..

## పాక్‌కు నిరసనకారుల అల్టిమేటమ్



పీఓకే అభివృద్ధి కోసం పాక్ పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జేఏఏసీ ఆరోపిస్తోంది. రాజకీయంగా పీఓకేపై ఆధిపత్యం సాధించేందుకు రకరకాల కుయుక్తులను పాక్ పాలకులు పన్నుతున్నారని మండిపడుతోంది. పీఓకే అసెంబ్లీలో 12 నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థులను పాక్ పాలకులే నామినేట్ చేయడంపై జేఏఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.
పాక్ నుంచి వలసొచ్చిన 4.36 లక్షల మంది ఓటర్ల కోసం ఈ 12 సీట్లను కేటాయించడం, 33 లక్షల మంది పీఓకే ఓటర్లకు మాత్రం కేవలం 33 సీట్లే ఉండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పీఓకేను తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు ఈ ఎత్తుగడకు పాక్ పాలకులు తెరతీశారని జేఏఏసీ మండిపడుతోంది. ఈ 12 సీట్లకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని ఇటీవల పాక్ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది.ఈ నేపథ్యంలో నామినేటెడ్ సీట్లను రద్దు చేయాల్సిందేనని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. వీటితో పాటు గతంలో ప్రతిపాదించిన హైడ్రోప్రాజెక్టులపై మళ్లీ చర్చలు ప్రారంభించడం, నిత్యావసరాలపై సబ్సిడీలు పెంచడం, విద్యుత్ ధరలు తగ్గించడం వంటి 38 డిమాండ్స్ ప్రభుత్వం ముందుంచింది. ఇక జులై 27న పీఓకేలో ఎన్నికలు జరగనున్నాయి. నేటి నుంచీ అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే జేఏఏసీ తాజా అల్టిమేటమ్‌ను జారీ చేసింది.

# బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**
ఇప్పుడూ చేస్తున్నానని తెలిపారు. సింగరేణిలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైన్ అనే హెల్త్ మిక్స్ ఉండాలని, అప్పుడే సంస్థ బాగుంటుందన్నారు. సింగరేణిలో ఉద్యోగులు, కార్మికులంతా వన్ విజన్, వన్ ఫ్యామిలీలా ఉంటారని చెప్పారు. కానీ ఇప్పుడు ఆఫీసర్లకు ఒక రూల్, కార్మికులకు ఒక రూల్ నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు.పెండింగ్‌లో ఉన్న రూ.54 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో సింగరేణి సంస్థ పనిముట్లు కొనుక్కోలేని పరిస్థితికి దిగజారిందని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ నిర్లక్ష్యం కారణంగా సింగరేణి కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దొడ్డిదారిన ప్రయివేట్ కు ఇచ్చిన తాడిచర్ల-1 మైనింగ్‌ను మళ్లీ సింగరేణికే అప్పగించాలనీ, అప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు వచ్చేలా బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎంతో కృషి చేశానని చెప్పారు. నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టి పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు క్లియర్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి రైతుల మీద ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారని ఆరోపించారు. ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోనే 90 మంది రైతులపై అక్రమ కేసులు, 9 మంది రైతులపై రౌడీ షీట్లు పెట్టారని చెప్పారు. వెంటనే ఆ కేసులను, రౌడీ షీట్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.'టీఆర్ఎస్ ' పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలని చూస్తే ఆ పేరు రాకుండా ఉండాలని కొందరు కుట్రలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. తాను పార్టీ పెట్టుకొని తన పని తాను చేసుకుంటూ పోతున్నానని, ఇప్పటి వరకు బీఆర్ఎస్ విషయంలో ఎక్కడా వ్యక్తిగత విషయాలు మాట్లాడలేదని స్పష్టం చేశారు. కేటీఆర్ రూ.188 కోట్లు పెట్టి ఇటీవలే పయోనీర్ అనే ఇంగ్లిష్ పేపర్‌ను కొనుగోలు చేశారని అన్నారు. క్విడ్ ప్రోకోలో భాగంగా అతని మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్‌కు అక్రమంగా పర్మిషన్లు ఇచ్చి పెద్ద భవనాలు కట్టుకునే అవకాశం ఇచ్చారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథి మహబూబ్ నగర్‌లో పెట్టే ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారన్నారు. డబ్బుతో సోషల్ మీడియా, మీడియాను కొనుగోలు చేసి తమ వార్తలు రాకుండా చేయాలని కుట్రలు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పన్నంగా అప్పగించిన భూములన్నింటిపై రివ్యూ చేస్తామని తెలిపారు. మొత్తం అవినీతిని కక్కిస్తామని, ఎవరినీ వదలిపెట్టబోమని హెచ్చరించారు.

# శంషాబాద్ సాతంరాయి వద్ద ఘోర ప్రమాదం..

## బస్ స్టాప్‌లోకి దూసుకెళ్లిన బొలెరో. - ఇద్దరు మహిళలు మృతి







**శంషాబాద్ జులై 9, (ప్రజావినికిడి):** శంషాబాద్ సమీపంలోని శాతంరాయి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూరగాయలతో లోడ్ వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి, బస్సు కోసం ఎదురుచూస్తున్న వారిపైకి దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. శంషాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం, ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఆర్టీసీ బస్టాప్‌లో బస్సు కోసం వేచి ఉన్న మహిళలు (సుమ, సువర్ణ) వాహనం కింద నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పక్కన ఉన్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బొలెరో స్కిడ్ అవ్వడం వల్ల ఈ విషాదం జరిగిందని ప్రాథమిక సమాచారం. ప్రమాదానికి గురైన మహిళలు సాతాం రాయ్ కి చెందిన గ్రామస్తులేనని తెలుస్తోంది. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రక్రియను చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### సాతంరాయి జాతీయ రహదారిపై దర్నా చేపట్టిన స్థానికులు

ఈ ఘోర ప్రమాదానికి నిరసనగా, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆగ్రహానికి గురైన స్థానిక గ్రామస్తులు, మృతుల బంధువులు ఒక్కసారిగా హైదరాబాద్ శంషాబాద్ జాతీయ రహదారిపైకి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, సాతంరాయి జంక్షన్ వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ... సాతంరాయి బస్ స్టాప్ వద్ద నిరంతరం ప్రజల రద్దీ ఉంటుందని, అయినా అక్కడ కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని ఆందోళనకారులు మండిపడ్డారు. ప్రమాదాలు జరగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం, వేగ నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం మరియు కనీసం ట్రాఫిక్ పోలీసులను కూడా విధుల్లో ఉంచకపోవడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఈ ప్రమాదకరమైన స్పాట్ గురించి గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడం వల్లే నేడు ఇద్దరు అమాయకులు బలయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతికి కారణమైన బొలెరో డ్రైవర్‌పై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత శాఖల అధికారులపై కూడా చర్యలు చేపట్టాలి, సాతంరాయి బస్ స్టాప్ వద్ద తక్షణమే శాశ్వత భద్రతా చర్యల కింద బ్యారికేడ్లు,స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ఇక్కడ శాశ్వతంగా పోలీసు సిబ్బందిని కేటాయించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు భారీగా సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో సుదీర్ఘంగా చర్చలు జరిపి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని, సత్వరమే భద్రతా చర్యలు చేపడతామని హామీఇచ్చారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు

## జూలై 13న ఆల్బెండజోల్ పంపిణీ -1 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులందరికీ మాత్రలు వేయాలని అధికారుల పిలుపు









**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై అవగాహన సదస్సు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వి. విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ నులిపురుగులు కలుషితమైన ఆహారం, నీరు, పరిశుభ్రత లోపం, చెప్పులు లేకుండా నడవడం వంటి కారణాల వల్ల శరీరంలోకి ప్రవేశించి పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. గుండ్రపు పురుగు, కొరడా పురుగు, కొంకి పురుగు, దారపు పురుగు, బద్దె పురుగు వంటి ఐదు రకాల నులిపురుగుల గురించి అవగాహన కల్పించారు.

డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల కడుపునొప్పి, ఆకలి తగ్గడం, రక్తహీనత, అలసట, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్యుల సూచన మేరకు ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జూలై 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరికీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీలు,

ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని తెలిపారు. ఆ రోజు మాత్ర తీసుకోలేని విద్యార్థులకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ డేలో తప్పనిసరిగా ఆల్బెండజోల్ అందజేయాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి మనోహర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరగా, ఎంపీడీవో శ్రీకాంత్ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ,హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# చేయి నొప్పికి గర్భసంచి తొలగింపు..

### మహిళా మృతి..

### ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన..







**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలో వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు దవాఖాన ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో వెలుగు చూసింది..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..షాద్ నగర్ పట్టణం లోని క్రిస్టియన్ కాలనీకి చెందిన బిజ్జ సుజాత అనే మహిళ తన చెయ్యి నొప్పి అని దవాఖానలో చేరిన్నట్లు తెలిపారు.దీంతో వైద్యులు ఆమెకు స్కాన్ చేసి గర్భసంచి సమస్య ఉందని దాని తొలగించాలని ఆపరేషన్ చేయడంతో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం పై కుటుంబ సభ్యులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

# సర్ కార్యక్రమానికి సహకరించండి..

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్..

### పోలింగ్ స్టేషన్లో బారీగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ పిలుపునిచ్చారు. ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని 236, 237 పోలీస్ స్టేషన్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 1496 మంది ఓటర్లకు ఫారాలను అందించారు. బిఎల్ఓ శ్రీలత,బి ఎల్ ఎ మహమ్మద్ అఫ్రోజ్,సర్వర్ పాషా,సయ్యద్ ఖాదిర్,జంగయ్య, మహమూద్ బాయ్,కాజా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువతకు వరంగా మినీ స్టేడియం..

### త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం, యువతలో ప్రతిభను వెలికితీయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలో సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్ల వ్యయంతో మంజూరైన మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టర్ సిద్ధార్థకు పలు సూచనలు చేశారు. స్టేడియం కోసం కేటాయించిన భూమికి సంబంధించిన సర్వేను వెంటనే పూర్తి చేసి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ సిద్ధార్థ కూడా వేగంగా పనులు ప్రారంభించేలా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, మినీ స్టేడియంల ఏర్పాటు వల్ల యువతకు మెరుగైన శిక్షణా అవకాశాలు లభిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.క్రీడా మౌలిక వసతులు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చెందితే యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు ఆకర్షితులవుతారని,స్థానికంగా క్రీడా పోటీలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని, గ్రామీణ క్రీడాకారులకు నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, కొందుర్గు మినీ స్టేడియం పూర్తయిన తర్వాత ఈ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి,ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, , సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్,రాములు గౌడ్ కేకే కృష్ణ,సర్పంచులు అంజి,ఫయం, జంగీర్,వీరేందర్ రెడ్డి జీబీ కృష్ణ,బోరేగ నరేందర్,బొట్టు శ్రీను,గుట్ట రాజు, నర్సింహా రెడ్డి, రవీందర్ రెడ్డి,గాలి శ్రీను,నాగులపల్లి శివకుమార్,మామిడిపల్లి రవి, ద్వేజేందర్,కోయల నర్సింలు,ఫిల్వాన్, కటిక రఘు జమల్పూర్ నరేందర్,శ్రీనాథ్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి,రమేష్ పామేనా,కుమార్, శివకుమార్,వేమా రెడ్డి,కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 11న ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం



**యాదగిరిగుట్ట,జూలై9(ప్రజావినికిడి):** ఈనెల 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భవాని శంకర్ వెల్లడించారు. గురువారం ఈవో కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తిరుమల తరహాలో ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉదయం 11 .37 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం ప్రెసిడెంట్ సూట్‌లో ట్రస్ట్ బోర్డ్ మొదటి సమావేశం జరుగుతుందని వివరించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా ఎం సత్యనారాయణ రెడ్డి , మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మీడియాకు అనుమతి లేదన్నారు. స్వీకారో త్సవం నిరాడంబరంగానే కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకు ఎవరికి ఆహ్వానం అందజేయలేదని ఈవో వెల్లడించారు. ఒకవైపు దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికను వీఐపీలకు అందజేస్తూనే మరోవైపు ఎవరికి ఆహ్వానం లేదనడంపై విచిత్రంగా ఉందని స్థానికులు ఆరోపించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సిద్ధాపూర్ గ్రామ డంపింగ్ యార్డు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి

**కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బాధితులుధ -నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం భేటీ.. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి..**

**షాద్ నగర్,(ప్రజా వినికిడి)జూలై 9:**
సిద్ధాపూర్ గ్రామం సమీపంలోని పచ్చని వ్యవసాయ భూములు, గ్రామాల మధ్య డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.నెం. 641ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ బాధిత గ్రామాల ప్రతినిధులు కేంద్ర బొగ్గు అలాగే గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.
బీజేపీ తెలంగాణ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జయపాల్ నాయక్,నాగేష్ నాయక్, శివలింగం,మహేష్ నాయక్,సుమన్ నాయక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ప్రతినిధి బృందం కేంద్ర మంత్రికి వివరించిన ప్రకారం, ప్రతిపాదిత డంపింగ్ యార్డు వల్ల 20 గ్రామాలు, 8 తండాలకు చెందిన సుమారు 30 వేల మంది ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని, వేల ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములు దెబ్బతింటాయని, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదంతో పాటు ప్రజల ఆరోగ్యం, పశుసంపద, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు.
వినతిపత్రాన్ని స్వీకరించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమస్యపై సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంపై లేఖ రాస్తానని,అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించి బాధిత ప్రజలకు భారతీయ జనతా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలను పూర్తిగా విస్మరించి వ్యవసాయ భూములు, గ్రామాల మధ్య డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రజల ప్రాణాలు, రైతుల జీవనాధారం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా జి.ఓ. నెం. 641ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, పారిశ్రామిక అభివృద్ధి పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించిందని, ఇప్పుడు ఆ ప్రయోజనాల కోసం వాటిని వినియోగించకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం రైతులను, ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన అసలు ఉద్దేశ్యాలకు భిన్నంగా భూములను వినియోగించాలనుకుంటే, ఆ భూములను సంబంధిత రైతులకు తిరిగి



అప్పగించాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, పర్యావరణానికి, వ్యవసాయానికి, గ్రామీణ జీవనానికి ముప్పు తెచ్చే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు.
డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ గత అనేక రోజులుగా పార్టీలకు అతీతంగా గ్రామాల ప్రజలు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల మధ్యకు వచ్చి "ఎలాంటి డంపింగ్ యార్డు రాదు" అని చెప్పి ఉద్యమాన్ని నిర్వీర్యం చేశారని, అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.నెం. 641ను జారీ చేసిన నేపథ్యంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందని అన్నారు.
"డంపింగ్ యార్డు రాదని చెప్పిన మీరు,ఇప్పుడు వచ్చిన జీవోపై ఏమి చెబుతారు? మీకు తెలియకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందా? లేక ప్రజలను తప్పుదోవ పట్టించారా? ప్రజల నుంచి పాలాభిషేకాలు చేయించుకున్న నాయకులు ఇప్పుడు నిజాలు చెప్పాల్సిన సమయం వచ్చింది" అని ప్రశ్నించారు.
జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వల్ల అక్కడి ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న కాలుష్య,ఆరోగ్య సమస్యలు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని పేర్కొంటూ,అదే పరిస్థితిని సిద్ధాపూర్ గ్రామం అలాగే పరిసర గ్రామాల ప్రజలపై రుద్దడం అన్యాయమని అన్నారు.
డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాల్సి వచ్చినా ప్రజా నివాసాలకు, విద్యాసంస్థలకు, వ్యవసాయ భూములకు దూరంగా,శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా అనువైన ప్రదేశాన్ని గుర్తించాలని, అమాయక ప్రజల జీవితాలను పణంగా పెట్టే నిర్ణయాలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.
ఈ సమస్య రాజకీయాలకు అతీతంగా ప్రజల జీవనానికి సంబంధించిన అంశమని పేర్కొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అన్ని రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు,సామాజిక సంస్థలు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి బాధిత ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.
ప్రజల సమస్యలపై మొసలి కన్నీరు కార్చడం,రాజకీయ లబ్ధి కోసం చాంపియన్లుగా నటించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అయినా,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా రాజకీయాలు పక్కనపెట్టి ప్రజల ప్రయోజనాలను కాపాడే నిర్ణయాలు తీసుకోవాలని, బాధిత గ్రామాల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వాలని కోరారు. సిద్ధాపూర్ గ్రామ డంపింగ్ యార్డు వ్యతిరేక ఉద్యమానికి భారతీయ జనతా పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని, బాధిత ప్రజలకు న్యాయం జరిగే వరకు ఉద్యమంకొనసాగిస్తామని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.


## దూసకల్ గ్రామంలో ఆవుల చోరీ..

### రైతు ఆందోళన..

### పశువులే తమ జీవన ఆధారం అంటన్నా శ్రీశైలం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫరూఖ్ నగర్ మండల్ దూసకల్ గ్రామనికి చెందిన ఇట్టమోని శ్రీశైలం వారి యొక్క డబల్ బెడ్ రూమ్ పక్కన ఉన్న పొలంలో ఆవుల చోరీ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో కలకలం రేగింది. శ్రీశైలం అనే రైతు బుధవారం రాత్రి ఇంటికి వెళ్ళి ఉదయానే పాల కోసం అనీ తన యొక్కపొలంకి రావడంతో అక్కడ చెందిన వ్యవసాయ



పొలంలో కట్టి ఉంచిన ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో చోరీ చేసినట్లు సమాచారం. ఉదయం పొలానికి వెళ్లిన శ్రీశైలం కు ఆవులు కనిపించకపోవడంతో ఆందోళాల చెందుతూ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ ఘటనపై బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి,చోరీకి సంబంధించిన వివరాలను సేకరిస్తూ సమీప ప్రాంతాల్లో ఉన్న దృశ్యాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గ్రామంలో వరుసగా పశువుల చోరీ ఘటనలు జరుగుతున్నాయనే ఆందోళనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. పశువులే తమ జీవనాధారమని, ఇటువంటి చోరీలు రైతులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తాయని తెలిపారు. రాత్రి వేళల్లో పశువుల చోరీలకు పాల్పడుతున్న వారి నీ గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు, చోరీకి గురైన ఆవులను త్వరగా గుర్తించి బాధితుడికి అప్పగించేందుకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం.

## స్పీకర్, మండలి ఛైర్మన్‌తో సిఎస్ భేటీ



**హైదరాబాద్,జూలై9((ప్రజావినికిడి)::** తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి ఛైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

## "ఛాత్రోన్ కి గూంజ్" కార్యక్రమంలో విద్యార్థులతో ముఖాముఖి

### -టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
ఛాత్రోన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన విద్యార్థులతో ముఖాముఖి చర్చా సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయభాను చిబ్ రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హాజరయ్యారు.
ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనల వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, వారి కృషికి తగిన ఫలితం దక్కకుండా పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రధానమంత్రి నరేంద్రమోడీ,కేంద్ర హోంమంత్రి అమిత్ షా,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ అంశంపై బాధ్యతాయుతంగా స్పందించలేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారం లోకి నెట్టారన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనదన్నారు. 2014 తర్వాత మోడీ ప్రభుత్వ హాయంలో దేశవ్యాప్తంగా 90 సార్లు పేపర్ లీకేజీలు జరిగాయన్నారు.



నీట్ పేపర్ లీకేజీ వల్ల 22 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.
రెండోసారి పరీక్ష రాయాల్సి రావడం తదితర కారణాలతో ఆందోళనకు గురై 12 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అదేవిధంగా,
గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బర్రెలు గొర్రెలు ఇవ్వడం జరిగిందని, విద్యార్థులకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.



లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ,నీట్ పేపర్ లీకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తుపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు.
తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలకు ఉన్నత విద్య అందిస్తున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత తప్పనిసరిగా ఉండాలని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, సర్టిఫికెట్ల జారీ తదితర సమస్యలను యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా సంప్రదించాలని, తమకు అన్ని విధాలా అండగా ఉంటామని మధుయాష్కి గౌడ్ తెలిపారు.

## హాకా రైతు సేవా కేంద్రాలను

# సద్వినియోగం చేసుకోండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ - ముట్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రైతాంగ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు, సదుపాయాలు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన హాకా రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు,ఇతర వ్యవసాయ సామగ్రి రైతులకు సకాలంలో అందుబాటులో ఉండేలా రైతు సేవా కేంద్రాలు పనిచేయాలని సూచించారు. రైతులు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల బారిన పడకుండా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, రైతు సేవా కేంద్రాలు రైతులకు నమ్మకమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముట్పూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులందరూ ఈ హాకా






రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు బాగుంటేనే గ్రామం,రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి,ఏఎంసీ ఛైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్,రాములు గౌడ్ కేకే కృష్ణ, సర్పంచులు అంజి, ఫయం, జంగీర్,వీరేంర్ రెడ్డి జీబీ కృష్ణ,బోరేగ నరేందర్,బొట్టు శ్రీను,గుట్ట రాజు,నర్సింహా రెడ్డి,రవీందర్ రెడ్డి,గాలి శ్రీను,నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి, ద్వేజేందర్,కోయల నర్సింలు, ఫిల్వన్,కటిక రఘు జమల్పూర్ నరేందర్,శ్రీనాథ్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి, రమేష్ ,పామేనా కుమార్, శివకుమార్, వేమారెడ్డి, కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మందల సామేలుకు వ్యతిరేకం కాదు

**ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం**

**పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లా**

**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జూలై9((ప్రజావినికిడి):** మందల సామేలుకు నేను వ్యతిరేకం కాదు..ఆయన తీసుకున్న నిర్ణయాలను కూడా వ్యతిరేకించడం లేదు..ఇద్దరం కూడా కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్‌తో గెలిచాం. పార్టీ నియామకాల అంశాన్ని పిసిసి దృష్టికి తీసుకెళ్లానని, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిణామాలపై చామల కిరణ్ రెడ్డి స్పందించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. గురువారం ఎంపీ చామల మీడియాతో మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య మనస్పర్థలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, ఎంపీగా తనకు ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేదని, అయినా కాంగ్రెస్ కార్యకర్తలు అక్కున చేర్చుకుని గెలిపించారన్నారు. 'నేను ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకం కాదు. నేను తుంగతుర్తి నియోజకవర్గంలో మండల అధ్యక్ష పదవికి, పీఏసీఎస్ చైర్మన్ పదవికి, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ప్రమోట్ చేయలేదు. కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎవరిని కోరుకుంటే వారికే పదవులు ఇద్దామని మందుల సామేల్‌తో చెప్పాను. మందుల సామేల్ తీసుకునే నిర్ణయానికి నేను వ్యతిరేకం కాదు. నేను విదేశాల్లో ఉన్నప్పుడు మండల అధ్యక్షులను ప్రకటించారు. దీనిపై నాకు కాంగ్రెస్ కార్యకర్తలు ఫోన్ చేశారు. ఇదే అంశాన్ని నేను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్లాను. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత మండలం తిరుమలగిరి, నా సొంత మండలం శాలి గౌరారం తుంగతుర్తి లోనే ఉన్నాయి. సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ అబ్జర్వర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తామని చెప్పాను. మండల స్థాయిలో కార్యకర్తలు.. ఎవరికి ఎక్కువగా మద్దతు ఇస్తే వారికే అవకాశం ఇద్దాం. పదవుల కోసం రో÷–డడెక్కి కొట్టుకుంటే ప్రజల్లో చులకన అవుతాము. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ కేడర్ సమన్వయం పాటించాలి. మనకు పదవులు వచ్చాయి. మన గెలుపు కోసం పని చేసిన కేడర్‌ను పట్టించుకోవాలి. ప్రజలు నమ్మకంతో మమ్మల్ని గెలిపించారు. అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మాపైన ఉంది' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు.

# ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నిజాజామాబాద్,జూలై9(ప్రజావినికిడి):** నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానిక పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసముండే ఎం జగదీష్ (60) అనే వ్యక్తి గత రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరవకపోవడంతో ఇంట్లోంచి దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచామందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని, బ్లాక్ నెంబర్ 13/2లో పై అంతస్తులు ఉండే జగదీష్ ఇంటి తలుపులను లోబడి నుండి పెట్టుకొని ఉండడంతో పోలీసులు స్థానికుల సహాయంతో డోర్లను తెరిచి చూశారు. ఆ ఇంట్లో మొదటి గదిలో ఆయన ఫ్యాన్ కు ఉరివేసుకొని వేలాడుతూ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య గత కొంత గీతం చనిపోవడం, అప్పటినుండి ఆయన ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని మృతుడి తమ్ముడైన మహేందర్‌కు పోలీసులు ఫోన్ చేసి సమాచారమందించారు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆయన ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏమిటన్న విషయం తెలియ రాలేదు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

---------

# తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే

**యూపిఎ హయాంలో కేటాయింపు అవాస్తవం**

**భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్**

**న్యూఢిల్లీ,జూలై9(ప్రజావినికిడి):**



తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్అన్నారు.యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు

పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# స్థిరంగా బంగారం ధరలు

**హైదరాబాద్,జూలై9(ప్రజావినికిడి):**అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,43,120గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,31,190గా ఉంది.మరోవైపు వెండి ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల నమోదైంది. కిలోకు వంద రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,44,900గా ఉంది.




# అభివృద్ధే నా అభిమతం..

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ - కొందుర్గు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
"అభివృద్ధే నా అభిమతం.. ప్రజలకు మెరుగైన రహదారులు, వంతెనలు,మౌలిక సదుపాయాలు కల్పించడమే నా లక్ష్యం" అని షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండలంలోని రేగడి చిల్కమర్రిరామచంద్రపురం గ్రామాల మధ్య రూ.5.60 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న హై లెవల్ బ్రిడ్జిలు, కల్వర్టులు, వంతెనల స్లాబ్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఈ పనులు పూర్తయితే దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని, గ్రామాల అభివృద్ధికి కొత్త దారి పడుతుందని పేర్కొన్నారు.
కొందుర్గు మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు,విద్యా, క్రీడా,పంచాయతీ మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. మండలంలోని శ్రీరంగాపూర్, చెరుకుపల్లి, అయోధ్యాపూర్ తండా, తంగళ్లపల్లి, ముట్పూర్ గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.100 లక్షలు, అగిర్యాల, భైరంపల్లి, లక్ష్మీ దేవుని పల్లి, టేకులపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు, ఉత్తరాస్పల్లి టేకులపల్లి మధ్య రూ.1.26 కోట్లతో వంతెన, తంగళ్లపల్లి-చించోడు గ్రామాల మధ్య రూ.1.98 కోట్లతో వంతెన, రేగడి చిల్కమర్రి.. రామచంద్రపురం మధ్య కల్వర్టుల నిర్మాణానికి రూ.1.10 కోట్లు, తంగళ్లపల్లి.. గంగన్నగూడ రహదారిపై కల్వర్టులు, చిన్న వంతెనల మరమ్మతులకు రూ.1.26 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా కొందుర్గు మండలానికి ఏకీకృత పాఠశాల, పరిగి రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించడం, మండల కేంద్రంలో మినీ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు కూడా త్వరితగతిన ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.కొందుర్గు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, కొందుర్గు మండల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి,ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి,దామోదర్ రెడ్డి, జితేందర్ రెడ్డి,సయ్యాద్ సాదిక్ మల్లేష్ గౌడ్,రాములు గౌడ్ కేకే కృష్ణ,సర్పంచులు అంజి, ఫయం,జంగీర్,వీరేందర్ రెడ్డి జీబీ కృష్ణ,బోరేగ నరేందర్,బొట్టు శ్రీను,గుట్ట రాజు,నర్సింహా రెడ్డి,రవీందర్ రెడ్డి,గాలి శ్రీను,నాగులపల్లి శివకుమార్, మామిడిపల్లి రవి,ద్వేజేందర్,కోయల నర్సింలు,ఫిల్వాన్, కటిక రఘు జమల్పూర్ నరేందర్,శ్రీనాథ్ రెడ్డి,జగన్మోహన్ రెడ్డి, రమేష్ ,పామేనా కుమార్, శివకుమార్,వేమా రెడ్డి,కాంట్రాక్టర్ సిద్ధార్థ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీనాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న బిజెపి, కాంగ్రెస్‌లు

**సింగరేణి ఆరోపణలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోదు**

**మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు కొప్పల, బాల్క సుమన్ విమర్శలు**

**హైదరాబాద్,జూలై 9:(ప్రజావినికిడి):**
సింగరేణిలో రాష్ట్రప్రభుత్వం వాటా 51 శాతం.. కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం ఉందని.. బీజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని లాభాల బాట పట్టించాం.. సింగరేణిలో కారుణ్య నియామకాలను కేసీఆర్ ఇచ్చారు.. జీవో 76 క్రింద వేలాది కుటుంబాలకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో కేసీఆర్ కృషి ఉంది. గనుల వేలానికి సంబంధించిన ఎంఎంటీఆర్ బిల్లును నేను ఎంపీగా వ్యతిరేకించా..బీఆర్ఎస్ ఆ చట్టానికి వ్యతిరేకంగా లోక్‌సభ నుంచి వాకౌట్ చేసింది.. సింగరేణిని వేలం పాట పెడితే సింగరేణి నష్టపోతుందని ఆనాడే రాజ్యసభలో మా పార్టీ తరపున ఆనాడు కేశవరావు మాట్లాడిండు. సింగరేణి బొగ్గు బావులను వేలం వేయొద్దని ప్రధాని మోడీకి కేసీఆర్ లేఖ రాశారు. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణిని సిరుల గనిగా ఉంచారు. కాంగ్రెస్ అధికారంలోకి




వచ్చిన తరువాత సింగరేణిలో కుంభకోణాలకు అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ తో టెండర్ లో కుంభకోణం చేశారు. 42 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు 16 వందల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని బాల్క సుమన్ అన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సింగరేణిలో మొత్తం 16 వేల కోట్ల కుంభ కోణాలు జరిగాయన్నారు. మా నాయకుడు హరీష్ రావు బొగ్గు నిల్వల చూసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ వచ్చిన తరువాత సింగరేణిలో డీజిల్ కుంభకోణానికి తెరలేపారు. పంపకాల విషయంలో ముఖ్యమంత్రి మంత్రుల మధ్య పంచాయతీ రావడంతో ,ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్ టెండర్ ను రద్దు చేశారు .బడే బాయ్, చోటే బాయ్ మధ్యలో మిడిల్ బాయ్ కిషన్ రెడ్డి .అందరు కలిసి సింగరేణిని ముంచుతున్నారని ఫైర్ అయ్యారు. తాడిచర్ల బొగ్గు బ్లాక్ 2ను సాధించామని బీజేపీ, కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంటున్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే ఆగమేఘాల మీద కేంద్ర బృందాన్ని పంపారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై కేంద్ర బృందం ఎందుకు రావడం లేదు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి సింగరేణిలో వందల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడుతున్నారు.
ఆధారాలతో సహా మా నాయకుడు హరీష్ రావు సింగరేణి కుంభకోణం బయటపెడితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి బాయి బాయి అందుకే సింగరేణిలో కుంభకోణాలకు పాల్పడుతున్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి కిషన్ రెడ్డికి ఎందుకు కనిపించడం లేదు. అన్ని ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఓపెన్ కాస్ట్ బొగ్గు బ్లాక్ లను నామినేషన్ పద్ధతిలో సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.

# ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

**కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు -మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి**




**వరంగల్,జూలై 9: (ప్రజావినికిడి):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదం
టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. కొండా సురేఖ, కడియం శ్రీహరి ఇద్దరితో త్వరలోనే మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని, అలాంటి చర్యలను పార్టీ ఏమాత్రం సహించబోదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# గందరగోళంలో వ్యవసాయం

**జూలై 9 (ప్రజావినికిడి):**
ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌నినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు



అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది
రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించాలంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

## ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

**దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు**

**కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం**


**వాషింగ్టన్, జూలై 9(ప్రజావినికిడి):**


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన పక్రియలో కొనసాగుతోంది.

## మరోమారు కలవరపెడుతున్న కోవిడ్

**రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి -అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ**

**తిరుపతి, జూలై 9 (ప్రజావినికిడి):**
కోవిడ్ మరోమారు కలవర పెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు



సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశాం. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## వైసిపి పాలనతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

**ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భయాందోళనలు**
**అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశాం**
**దళారులతో పనిలేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు**
**కులమత విద్వేషాలు రగిలించే వారిపట్ల జాగ్రతగా ఉండాల్సిందే**
**బనగానిపల్లె సభలో సింఎం చంద్రబాబు నాయుడు**

**నంద్యాల,జూలై 9(ప్రజావినికిడి):**
గత వైసిపి పాలకుల నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం చంద్రబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్.. ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని విమర్శించారు. మాట వినని వారి భూములను 22ఏ జాబితాలో చేర్చారని వ్యాఖ్యానించారు. బనగానపల్లెలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆస్తిపై ప్రజలకే హక్కు ఉండాలని స్పష్టం చేసిన సీఎం.. భూమి ప్రజలదైతే పట్టా పుస్తకాలపై, భూమి సరిహద్దు రాళ్లపై గత ప్రభుత్వం తమ ఫొటోలు, పేర్లు ముద్రించడం సరైంది
కాదన్నారు. ఫొటోల పిచ్చి పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. జగన్ ఫొటోలతో ఉన్న పాత పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, ఇప్పుడు రాజముద్రతో పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. రైతులకు పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సమస్యనూ పరిష్కరించే బాధ్యత తమదేనని చెప్పారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా గ్రామసభల్లోనే పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్



ద్వారా భూమికి సంబంధించిన పూర్తి వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే బాధ్యత నాది. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలో, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో 70 ఏళ్ల నాటి సమస్యలు పరిష్కరించాం. భూముల వివరాలన్నీ మీ సమక్షంలోనే పొందుపరుస్తున్నాం. దళారీ వ్యవస్థకు చోటు లేకుండా గ్రామసభల్లోనే పుస్తకాలిస్తున్నాం. ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేయాలన్నదే మా లక్ష్యం. 6,887 గ్రామాల్లో సర్వే చేశాం.. 29,04,000 పాస్ పుస్తకాలిచ్చాం. క్యూఆర్ కోడ్‌లో రికార్డులన్నీ స్పష్టంగా ఉంటాయి. డోన్‌లో ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ భూములు సాగు చేసుకుంటున్న 784 మంది రైతుల సమస్య పరిష్కరించాం అని వివరించారు. రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను ఎవరూ ప్రోత్సహించవద్దు. కుల, మతాలను విభజించడానికి వీల్లేదు. రావణ్ అనే వ్యక్తి.. పురాణాలను దూషించాడు. రాముడు, సీతపై నీచంగా మాట్లాడాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించాడు. ఇలాంటి వాళ్లకు గొడ్డలిపార్టీ ఆర్థికసాయం చేసింది. రాష్ట్రంలో వింత ప్రవర్తన కలిగిన కొందరు వ్యక్తులున్నారు. ఆస్తి కోసం తల్లిని హింసిస్తున్నారు. ఓట్ల కోసం చనిపోయిన తండ్రికి పూజలు చేస్తున్నారు. తల్లిని గౌరవించలేని వ్యక్తి మనకు అవసరమా? తల్లులంటే గౌరవం ఉండాలనే.. తల్లికి వందనం తీసుకొచ్చా. గొడ్డలి పార్టీ.. విసుగు, విరామం లేకుండా కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. కులం, మతం, ప్రాంతాల వారీగా ముక్కలు చేసే కుట్రకు పాల్పడుతోంది. రాయలసీమలో ముఠాలు లేకుండా చేసింది తెదేపానే. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా ఉండాలి. ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరగాలి. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, మనోభావాలు దెబ్బతీయడం మంచిదికాదు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అని మళ్లీ హెచ్చరిస్తున్నానని చంద్రబాబు అన్నారు.
గ్రామసభలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. బనగానపల్లె.. బ్రహ్మంగారు నడయాడిన పవిత్ర ప్రాంతమని పేర్కొన్న ఆయన, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కంటే అరాచక పాలనే ఎక్కువగా కనిపించిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి విమర్శించారు. ఐదేళ్లలో రాయలసీమ కోసం వైసీపీ నేతలు ఏం చేశారో, తాము ఏం చేశామో ప్రజల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. బనగానపల్లె బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రారంభిస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మళ్లీ తమ ప్రభుత్వం ఆ పనులను వేగవంతం చేసి బైపాస్ రోడ్డు నిర్మాణంలో 70 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే బనగానపల్లెలో 41 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యం చేశారని బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.
----------------------

## 29 గ్రామాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ...

**అమరావతి రైతు జేఏసీ కీలక నిర్ణయం**



అమరావతి **జూలై 9 (ప్రజావినికిడి):**
రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అమరావతి 'రైతు జేఏసీ' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని మొత్తం 29 గ్రామాల ప్రతినిధులతో ఒక ప్రత్యేక అభివృద్ధి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు తీర్మానించారు.
ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అసలైన రైతుల ఉమ్మడి సమస్యలు పక్కదారి పడుతున్నాయని జేఏసీ అభిప్రాయపడింది. అందుకే అందరి తరఫున మాట్లాడేలా ఒక అధికారిక కమిటీని తేవాలని నిర్ణయించింది.రాజధాని నిర్మాణం కోసం తాము ఎప్పుడో భూములు ఇచ్చినప్పటికీ... క్షేత్రస్థాయిలో రైతులకు సంబంధించిన అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే అభివృద్ధి కమిటీ ద్వారా ఈ సమస్యలన్నింటినీ నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంత అభివృద్ధి అనేది కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా 29 గ్రామాల్లోనూ సమానంగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
“గతంలోనూ జేఏసీలు ఏర్పాటు చేశారు కానీ, వాటిలో సరైన కమిటీ వివరాలు లేవు. ఇప్పుడు ఎవరికి వారే తామే నాయకులమనే తీరుగా వ్యవహరిస్తున్నారు. అలా కాకుండా, కొత్త కమిటీలో ప్రతి గ్రామం నుంచి అన్ని కులాల వారికి సమాన ప్రాధాన్యత ఇస్తాం“ అని రైతు జేఏసీ నేతలు వెల్లడించారు.

# సౌరభ్ గంగూలీకి అరుదైన గౌరవం



భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీకి అరుదైన గౌరవం దక్కింది. అతడికి ప్రతిష్ఠాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. బుధవారం గంగూలీ తన 54వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన రోజునే ఆయనకు ఈ గౌరవం దక్కడం విశేషం. కాగా, స్కాట్లాండ్ వేదికగా జులై 8 నుంచి 11 దాకా ఐసీసీ బోర్డు మీటింగ్ జరగనుంది. ఈ సమావేశం ముగిసిన తర్వాత గంగూలీ పేరును అధికారికంగా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చనున్నారు. ఈ గౌరవం దక్కడంపై గంగూలీ స్పందించాడు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు కల్పించడం తనకు దక్కిన గొప్ప గౌరవం అని గంగూలీ అన్నాడు. ఇందుకుగానూ ఐసీసీ బోర్డు, ఐసీసీ ఛైర్మన్ జై షాకు థాంక్స్ చెబుతూ ఎక్స్‌లో ఓ పోస్టు చేశాడు. 'నన్ను హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చినందుకు ఐసీసీ, బోర్డు ఛైర్మన్ జై షాకు ధన్యవాదాలు. ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. ఇప్పటివరకు హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న భారతీయులలో నేనూ ఒకడిని కావడం, అలాగే గొప్ప వ్యక్తుల పేర్లతో పాటు నా పేరు కూడా చేరడం ఆనందంగా ఉంది' అని గంగూలీ ఎక్స్ పోస్టులో రాసుకొచ్చాడు.

కాగా, ఈ ఘనత దక్కించుకున్న 12వ భారత క్రికెటర్ గంగూలీ. భారత క్రికెట్‌కు గంగూలీ 2000 నుంచి 2005 మధ్య కెప్టెన్సీగా సేవలు అందించారు. ముఖ్యంగా మ్యాచ్-ఫిక్సింగ్ సంక్షోభం తర్వాత జట్టును పునర్నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గంగూలీ 113 టెస్టుల్లో 7,212 పరుగులు, అలాగే 311 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో 11,363 పరుగులు సాధించాడు. ఇదిలా ఉండగా, సౌరభ్ గంగూలీ పుట్టినరోజు సందర్భంగా 'దాదా: ది సౌరభ్ గంగూలీ స్టోరీ' బయోపిక్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది ఆ సినీ బృందం. బాలీవుడ్ కథా నాయకుడు రాజ్‌కుమార్ రావ్ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం వచ్చే ఏడాది మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్రమాదిత్య దర్శకత్వం వహిస్తుండగా, లవ్ రంజన్, అంకుర్ గార్గ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా రిలీజ్ చేసింది. గంగూలీ 'జెర్సీ' మూమెంట్‌ను గుర్తుచేస్తున్నట్లున్న ఈ ఫస్ట్‌లుక్‌కు నెటిజన్లు, గంగూలీ అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. నాట్‌వెస్ట్ ట్రోఫీలో భాగంగా 2002లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ జట్టుపై భారత్ గెలిచినప్పుడు స్టేడియం బాల్కనీలో ఉన్న గంగూలీ తన జెర్సీని విప్పి చేత్తో తిప్పుతూ సంబరాలు చేసుకున్న దృశ్యాన్ని క్రికెట్ అభిమానులు ఇప్పటికీ మరచిపోలేరు. తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్‌లో రాజ్‌కుమార్ రావ్ ఆ ఐకానిక్ మూమెంట్‌ను రీక్రియేట్ చేశారు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన జ్ఞాపకంగా క్రీడాభిమానుల మదిలో నిలిచిపోయిన ఈ దృశ్యాన్ని గంగూలీ ఇన్‌స్టాలో పంచుకున్నారు. 'అత్యుత్తమ బహుమతి! మీరు నా కవర్ డ్రైవ్ ఆడడం చూడడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను రాజ్‌కుమార్' అనే క్యాప్షన్ పెట్టారు. యువ క్రికెటర్ నుంచి ఇండియాలో అత్యంత ప్రభావవంతమైన కెప్టెన్‌లో ఒకరిగా ఎదిగిన గంగూలీ ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నట్టు చిత్రవర్గాలు తెలిపాయి.

# వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు

## నాలుగో టీ20పై టీమిండియా కసరత్తు



భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ ప్రస్తుతం అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇప్పటికే టీమిండియా 3 మ్యాచ్‌లలో రెండు ఓడిపోగా, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. దీనితో సిరీస్‌లో వెనుకబడిన భారత్, తన సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే బ్రిస్టల్‌లో జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ఈ చావో రేవో పోరు జట్టుకే కాకుండా, టీమిండియా యువ ఓపెనర్, యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి కూడా అత్యంత కీలకంగా మారింది. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ఆరంభం లభించని వైభవ్, తన మూడో మ్యాచ్‌లోనైనా పాత ఐపీఎల్ హిస్టరీని రిపీట్ చేస్తాడా అనే ఆశతో క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు. భారత జట్టు మేనేజ్‌మెంట్ ఈ ఇంగ్లాండ్ టూర్‌లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఐర్లాండ్ సిరీస్‌తో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లోనూ వరసగా విఫలమైన సీనియర్ ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడింది. యువ హిట్టర్ వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్స్ రావడంతో, రెండో టీ20 మ్యాచ్ ద్వారా అతను అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అయితే, ఆడిన మొదటి రెండు ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో వైభవ్ వరుసగా 14 పరుగులు, 13 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతని బ్యాటింగ్‌లో అగ్రెసివ్ షాట్లు, సిక్సర్లు బాదగల విస్ఫోటక శైలి కనిపించినప్పటికీ, ఆ హిట్టింగ్‌ను పెద్ద ఇన్నింగ్స్‌గా మార్చడంలో అతను విఫలమయ్యాడు. వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడిన మొదటి రెండు మ్యాచ్‌లలో ఫెయిల్ అయినప్పటికీ, క్రికెట్ పండితులు అతనిపై గట్టి నమ్మకంతో ఉన్నారు. దీనికి కారణం అతని ఐపీఎల్ కెరీర్ లోని ఒక అద్భుతమైన సెంటిమెంట్. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2025 సీజన్ ద్వారా లీగ్‌లోకి అరంగేట్రం చేశాడు. తన మొదటి ఐపీఎల్ మ్యాచ్‌లోనే 20 బంతుల్లో 34 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే, రెండో మ్యాచ్‌లో కేవలం 16 పరుగులకే అవుటయ్యాడు. కానీ, తన కెరీర్‌లోని మూడో ఐపీఎల్ మ్యాచ్‌లో వైభవ్ ఏకంగా విశ్వరూపం చూపించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇంటర్నేషనల్ బౌలర్లను ఉతికేస్తూ, కేవలం 34 బంతుల్లోనే శతకం బాదాడు. మొత్తం 38 బంతుల్లో 11 సిక్సర్ల సాయంతో 101 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్‌ను ఒక్కసారిగా తనవైపు తిప్పుకున్నాడు. ఐపీఎల్‌లో జరిగినట్లే ఇప్పుడు ఇంటర్నేషనల్ క్రికెట్‌లో కూడా తన మూడో మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. వైభవ్‌కు ఒక అద్భుతమైన రికార్డ్ ఉంది; తన చిన్న కెరీర్‌లోనే జట్టుకు అత్యంత అవసరమైన, ప్రెజర్ ఎక్కువగా ఉండే డూ ఆర్ డై మ్యాచ్‌ల్లోనే అతను ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఐపీఎల్ అయినా, అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్ అయినా, లేదా ఇటీవలే జరిగిన ఇండియా-ఎ, శ్రీలంక-ఎ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ అయినా.. వైభవ్ ఎల్లప్పుడూ ఒత్తిడిని జయించి గేమ్ ఛేంజర్ ఇన్నింగ్స్‌లు ఆడాడు.

# టాప్ ఆర్డర్‌లోనే సంజూకు అవకాశాలు ఇవ్వాలి

## మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమ్ సూచన

ఇంగ్లాండ్‌తో బ్రిస్టల్ వేదికగా జరగబోయే నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు భారత జట్టు సెలెక్షన్, బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. స్టార్ ప్లేయర్ సంజూ శాంసన్ పట్ల టీమ్ మేనేజ్‌మెంట్ ప్రవర్తిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. జట్టులో మార్పులు చేయాల్సి వస్తే మొదట సంజూ శాంసన్‌నే పక్కన పెట్టడం లేదా బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకు నెట్టడం ఒక అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలో కూడా ఇలాగే చేశారని, ఇప్పుడు సంజూను కూడా అదే విధంగా ట్రీట్ చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదని గంభీర్, శ్రేయస్ అయ్యర్ లూప్‌కు ఆకాశ్ చోప్రా సూచించారు. మొదటి టీ20 తర్వాత గత రెండు మ్యాచ్‌లుగా సంజూ శాంసన్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేదు. ఓపెనర్లుగా వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మలు బరిలోకి దిగుతుండటంతో సంజూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీనిపై ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "ఒకవేళ మీరు నాలుగో మ్యాచ్‌లో సంజూను జట్టులోకి తెచ్చినా, ప్రస్తుత బ్యాటింగ్ ఆర్డర్ ప్రకారం అతనిని ఎక్కడ ఆడిస్తారు వైభవ్, అభిషేక్ ఓపెనింగ్ చేసి, ఈషాన్ కిషన్ నెంబర్ 3లో, శ్రేయస్ అయ్యర్ నెంబర్ 4లో వస్తే.. కేవలం కుడిచేతి వాటం బ్యాటర్ కావాలనే కారణంతో సంజూ శాంసన్‌ను



నెంబర్ 5 పొజిషన్‌లో ఆడించడం సరైన నిర్ణయం కాదు. అసలు ఇందులో సంజూ చేసిన తప్పేంటి జట్టులో ఎవరినైనా తీసేయాలంటే మొదట గుర్తొచ్చేది అతనే, అలాగే బ్యాటింగ్ ఆర్డర్ మార్చాలన్నా బలయ్యేది అతనే. నేను ఎప్పుడు సంజూను ఆడించినా మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ఆడించను, అతని కోసం ఓపెనింగ్ స్థానాన్ని ఖాళీ చేస్తాను. ఎందుకంటే అతను అక్కడే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వగలడు" అని స్పష్టం చేశారు. గణాంకాల పరంగా చూసినా సంజూ శాంసన్‌ను టాప్ ఆర్డర్‌లోనే ఆడించాలని ఆకాశ్ చోప్రా గుర్తు చేశారు. సంజూ శాంసన్ తన కెరీర్‌లో ఆడిన 57 టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లలో కేవలం 10 సార్లు మాత్రమే నెంబర్ 5 లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ మ్యాచ్‌లలో అతని యావరేజ్ కేవలం 21.13 గా మాత్రమే ఉంది. మొత్తం మీద ఆ పొజిషన్‌లో అతను చేసిన పరుగులు 169 మాత్రమే. దీనిని బట్టి చూస్తే లోయర్ మిడిల్ ఆర్డర్ అనేది సంజూ శాంసన్ శైలికి సరిపోదని, అతనికి ఓపెనింగ్‌లోనే ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని ఆకాశ్ చోప్రా డిమాండ్ చేశారు. ఇదే సమయంలో జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఫామ్‌పై వస్తున్న విమర్శలను ఆకాశ్ చోప్రా కొట్టిపారేశారు. సంజూ శాంసన్ కోసం తిలక్ వర్మను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. "తిలక్ వర్మ మన జట్టుకు వైస్ కెప్టెన్. ఈ సిరీస్‌లో అతని ప్రదర్శన అంత ఘోరంగా ఏమీ లేదు. గత నాలుగు మ్యాచ్‌లను గమనిస్తే అతనికి వచ్చిన అవకాశాలు చాలా తక్కువ. ప్రస్తుతం అతను బ్యాటింగ్ చేస్తున్న పొజిషన్ చాలా కఠినమైనది. అలాంటి స్థానంలో ప్రతి మ్యాచ్‌లోనూ స్థిరంగా రాణించడం ఎవరికైనా కష్టమే. అతని విషయంలో మేనేజ్‌మెంట్ కాస్త ఓపికగా వ్యవహరించాలి. సంజూ శాంసన్‌కు చోటు కల్పించడం కోసం తిలక్ వర్మ స్థానాన్ని మార్చాల్సిన అవసరం లేదు" అని ఆకాశ్ చోప్రా భారత జట్టుకు సలహా ఇచ్చారు.

# స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై ఐసీసీ సీరియస్



మ్యాచ్ జరుగుతుండగా, డ్రెస్సింగ్ రూమ్‌లో రికార్డు చేసిన వీడియోను రిలీజ్ చేయడం పట్ల ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని ఇంగ్లాండ్, వెల్స్ క్రికెట్ బోర్డును కోరింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు జరుగుతుండగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఈసీబీ విడుదల చేయడంపై వివాదం చెలరేగింది. అంతర్జాతీయ క్రికెట్‌కు హఠాత్తుగా వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాడు బెన్ స్టోక్స్ . ట్రెంట్ బ్రిడ్జ్‌లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు 4వ రోజు బెన్ స్టోక్స్ వీడ్కోలు వార్త బయటకొచ్చింది. ఆ రోజు ఆట మొదలవ్వడానికి ముందే డ్రెస్సింగ్ రూమ్‌లో స్టోక్స్ తనకు కెప్టెన్‌గా, ఆటగాడిగా ఇదే చివరి మ్యాచ్ అని సహచరులకు చెప్పాడు. అతడు తన వీడ్కోలు గురించి వెల్లడిస్తుండగా ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు మీడియా బృందం ఆ దృశ్యాలను రికార్డు చేసింది. అదేరోజు టీ బ్రేక్ సమయంలో సోషల్ మీడియాలో, టీవీ ఛానెళ్లలో స్టోక్స్ రిటైర్మెంట్ వార్త వెలుగులోకి వచ్చింది. ఇక మ్యాచ్ జరుగుతుండగానే స్టోక్స్ వీడ్కోలు వీడియో బయటకు రావడంపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆటగాడు, మ్యాచ్ అధికారులకు సంబంధించిన (పీఎంఓఏ) నిబంధలన ప్రకారం బెన్ స్టోక్స్ ఉల్లంఘనకు పాల్పడ్డాడని, ఈసీబీ కూడా ఇందులో హద్దు మీరిందని ఐసీసీ పేర్కొంది. పీఎంఓఏ నిబంధల ప్రకారం, మ్యాచ్ సమయంలో.. డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటివి రికార్డు చేయకూడదు. దీన్ని అతిక్రమణగా తేల్చిన ఐసీసీ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఈసీబీకి నోటీసులు పంపింది. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్.. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు నోటీసులు పంపడంపై బెన్ స్టోక్స్ సెటైర్ వేశాడు. దీనిపై సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. 'అతడిపై వేటు వేయండి' అని ట్వీట్ చేశాడు. ఇక ఈ వివాదంపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.

# మేజర్ లీగ్ క్రికెట్ 2026 సీజన్‌లో సరికొత్త రికార్డు



మేజర్ లీగ్ క్రికెట్ 2026 సీజన్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆటగాడైన సౌతాఫ్రికా యువ సెన్సేషన్ లూవాన్-డ్రే ప్రిటోరియస్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున బరిలోకి దిగిన ఈ 20 ఏళ్ల బ్యాటర్, ఎంఐ న్యూయార్క్‌పై విశ్వరూపం ప్రదర్శించాడు. కేవలం 52 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి.. మేజర్ లీగ్ క్రికెట్ చరిత్రలోనే శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ భీకర బౌలింగ్ ధాటికి పరుగుల వరద పారించలేకపోయింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 143 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం క్రీజులోకి వచ్చిన ప్రిటోరియస్ తొలి ఓవర్ నుంచే పరుగుల దాడి చేయడంతో మరో 26 బంతులు మిగిలి ఉండగానే శాన్ ఫ్రాన్సిస్కో అలవోకగా విజయం సాధించింది. భారీ హిట్టింగ్‌తో స్టేడియాన్ని హోరెత్తించిన ఈ మెరుపు ఇన్నింగ్స్ వెనుక ఓ ఇంట్రెస్టింగ్ స్టోరీ ఉంది. ప్రిటోరియస్ ఈ రికార్డు ఇన్నింగ్స్ ఆడింది తన సొంత బ్యాట్‌తో కాదు. తన ఓపెనింగ్ భాగస్వామి ఫిన్ అలెన్ బ్యాట్‌ను అడిగి మరి తీసుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న తర్వాత ప్రిటోరియస్ నవ్వుతూ.. "నేను ఫిన్ అలెన్ బ్యాట్‌తో ఆడాను. నా బ్యాట్‌తో ఆడితే బహుశా ఇన్ని భారీ సిక్సర్లు కొట్టలేకపోయేవాడిని. ఇప్పుడు ఎలాగైనా ఈ బ్యాట్‌ను నా బ్యాగ్‌లో శాశ్వతంగా పెట్టేసుకోవాలి" అని పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయంతో శాన్ ఫ్రాన్సిస్కో జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను పెంచుకుంది. ప్రస్తుత టోర్నమెంట్‌లో ప్రిటోరియస్ వరుస హాఫ్ సెంచరీలతో భీభత్సం సృష్టిస్తున్నాడు. ఇప్పటివరకు 69.16 అద్భుతమైన సగటుతో, 182.01 వేగవంతమైన స్ట్రైక్ రేట్‌తో టోర్నీలోనే అత్యధికంగా 415 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. గతంలో వాషింగ్టన్ ఫ్రీడమ్ ఆటగాడు మిచేల్ ఓవెన్ నెలకొల్పిన అత్యంత పిన్న వయస్కుడి సెంచరీ రికార్డును ప్రిటోరియస్ ఈ మ్యాచ్‌తో బ్రేక్ చేశాడు. అంతకుముందు ఎంఐ న్యూయార్క్ జట్టులో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ 35 పరుగులు చేయగా.. కెప్టెన్ నికోలస్ పూరన్ 19 పరుగులకే పరిమితమయ్యాడు. శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ తరఫున కెప్టెన్ మాథ్యూ షార్ట్ బాల్‌తో అద్భుతంగా రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. పేసర్లు హారీస్ రవూఫ్, ఆరోన్ హార్డీ చెరో రెండు వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు.

# రంగారెడ్డి రైజర్స్‌పై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం

టీజీ 20 లీగ్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్‌పై కరీంనగర్ డైమండ్స్ ఘన విజయం సాధించి క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డిపై కరీంనగర్ 75 పరుగుల తేడాతో నెగ్గింది. 239 పరుగుల భారీ ఛేదనలో రంగారెడ్డి జట్టు 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ (63 పరుగులు) హాఫ్ సెంచరీ చేశాడు. చివర్లో నితిన్ సాయి యాదవ్ (50 పరుగులు) పోరాడి ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాడు. కరీంనగర్ బౌలర్లలో ఆశిశ్ శ్రీవాత్సవ్ 5 వికెట్లతో చెలరేగగా, శుభమ్ శర్మ 2, దినేశ్, నారాయణ్ తేజ, సతీశ్ కుమార్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఛేదనలో రంగారెడ్డి తొలి నుంచే వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అరోన్ జార్జ్ (12 పరుగులు), అలంక్రిత్ రాపోల్ (2), ఆదిత్య జివ్వాలి (17 పరుగులు), జ్ఞాన రెడ్డి (1), వెంకట్ కార్తిక్ (1) స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. అయితే మరోవైపు, ఇంకో ఓపెనర్ తనయ్ త్యాగరాజన్ (63 పరుగులు, 33 బంతుల్లో) మెరుపులు మెరిపించడంతో రంగారెడ్డి పోటీలోనే ఉంది. 7.2 ఓవర్లకు 75-5తో పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. దీంతో రంగారెడ్డి ఓటమి చాలాసేపు ముందే ఖరారైంది. అయితే తనయ్, నితిన్ పోరాటంతో ఎక్కడో ఆశలు చిగురించాయి. కానీ 11.2 ఓవర్ వద్ద తనయ్‌ను శుభమ్ ఔట్ చేశారు. తనయ్, నితిన్ కాసేపు వికెట్ల పతనాన్ని ఆపారు. 24 బంతుల్లో 48 పరుగులు జోడించారు. కానీ తనయ్ ఔటైన తర్వాత రంగారెడ్డి వికెట్ల పతనం మళ్లీ షురూ అయ్యింది. ఓవైపు నితిన్ పోరాడినా అది ఓటమి అంతరాన్ని తగ్గించిందేగానీ మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపించలేదు. శ్రీవాత్సవ్ 5 వికెట్లతో సత్తా చాటాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. తన్మయ్



అగర్వాల్ (137 పరుగులు, 61 బంతుల్లో, 11 ఫోర్లు, 10 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగాడు. హెచ్ కే సింబ (50 పరుగులు, 28 బంతుల్లో) హాఫ్ సెంచరీతో రాణించాడు. దీంతో డైమండ్స్ జట్టుకు భారీ స్కోర్ దక్కింది. రంగారెడ్డి బౌలర్లలో కరియప్ప 2, అరుణ్ కుమార్, తనయ్ త్యాగరాజన్, బింద్రాక్య, నితిన్ యాదవ్ తలో 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో కరీంనగర్ జట్టు క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. ఓడిన రంగారెడ్డి రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక ఇవాళ హైదరాబాద్-ఖమ్మం జట్ల మధ్య జరగనున్న తొలి క్వాలిఫయర్‌లో ఓడిన జట్టుతో కరీంనగర్ పోటీ పడాల్సి ఉంటుంది. ఈ రెండో క్వాలిఫయర్ శుక్రవారం ఉప్పల్ వేదికగానే జరగనుంది.

# వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన చిరు షూటింగ్

## మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం



ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# మరో సస్పెన్స్ థ్రిల్లర్... వదల

సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.




-----

# సింపుల్ శారీలో కయాదు స్టన్నింగ్ లుక్



నటి, మోడల్ కయాదు లోహార్ తన సహజమైన అందం, అమాయకమైన చిరునవ్వుతో యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 'ఏం అందంరా బాబు.. సింపుల్‌గా చూసినా మతిపోతోంది' అనేలా కయాదు తాజాగా దిగిన ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. జూలై 10న విడుదల కాబోతున్న తన కొత్త సినిమా ప్రమోషన్స్ కోసం ఈ బ్యూటీ ధరించిన మోడ్రన్ స్కై బ్లూ డ్రెస్ ఫ్యాన్స్ గుండెల్లో మంటలు రేపుతోంది. ట్రెడిషనల్ శారీ లుక్‌కు మోడ్రన్ టచ్ ఇస్తూ కయాదు చేసిన ఈ గ్లామర్ విందు ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆ వివరాలు చూద్దాం. స్కై-బ్లూ లుక్‌లో మెరిసిపోయిన కయాదు: ప్రముఖ డిజైనర్ బ్రాండ్ 'జెనోరా అఫీషియల్' రూపొందించిన కస్టమ్ మేడ్ స్కై-బ్లూ కలర్ మోడ్రన్ డ్రేప్ శారీ లుక్‌లో కయాదు లోహార్ దేవకన్యలా మెరిసిపోయింది. లాంగ్ స్లీవ్స్ ఉన్న మెష్ షీర్ బ్లౌజ్, దానికి మ్యాచింగ్‌గా ఉన్న ఫ్లోర్ లెంత్ డ్రెప్డ్ స్కర్ట్ స్టైల్ శారీలో ఈ చిన్నది స్టన్నింగ్ పోజులు ఇచ్చింది. ఇక స్టైలిస్ట్ ఇనాజ్ ఫర్హాన్ ఆధ్వర్యంలో అట్రాంగి డిజైన్స్ జ్యువెలరీ పెట్టుకుని కయాదు చేసిన ఈ ఫోటోషూట్ చూసి కుర్రకారు అవాక్కవుతున్నారు.అందాల ముద్దుగుమ్మ కయాదు లోహార్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం కలబోసిన ఈ బ్యూటీ మొదట మోడలింగ్‌లో రాణించింది. ఆ తర్వాత కన్నడ చిత్రం 'ముగిల్‌పేట్'తో హీరోయిన్‌గా వెండితెరకు ఎంట్రీ ఇచ్చింది. ఇక మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ చిన్నది, ఆ తర్వాత తెలుగులో 'అల్లూరి' సినిమాలో నటించి మెప్పించింది. ఇక 'డ్రాగన్' మూవీతో యూత్ లేటెస్ట్ క్రష్‌గా మారిపోయింది. 'హృదయం మురళి' ప్రమోషన్స్ హడావిడి: అథర్వా మురళి హీరోగా నటిస్తున్న 'ఇదయం మురళి' (తెలుగులో 'హృదయం మురళి') సినిమాలో కయాదు లోహార్ ప్రధాన కథానాయికగా నటించింది. ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా ప్రీతి ముఖుందన్ నటిస్తుండగా, నిహారిక ఎన్ఎమ్ కీలక పాత్రలో కనిపిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగానే కయాదు ఈ రేంజ్‌లో గ్లామర్ తడాఖా చూపించి సినిమాపై అందరిలోనూ ఆసక్తిని పెంచేసింది. జూలై 10న గ్రాండ్ రిలీజ్: మంచి అంచనాలు ఉన్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ముఖ్యంగా తెలుగులో ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ 'మైత్రీ మూవీ మేకర్స్' విడుదల చేస్తుండటంతో సినిమాపై మంచి హైప్ క్రియేట్ అయ్యింది. చాశ్రీంశీ =ఖుం - సెన్సార్ బోర్డ్ ఇబ్బందుల్లో సినిమాలు! ఎలాంటి లుక్‌లో ఉన్నా తన సహజమైన నవ్వుతో, అందంతో మాయ చేయడం కయాదు లోహార్‌కే చెల్లింది. ఈ సింపుల్ అండ్ స్టైలిష్ స్కై-బ్లూ లుక్‌తో తనేంటో మరోసారి ప్రూవ్ చేసుకుంది. జూలై 10న రాబోతున్న 'హృదయం మురళి' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో మరియు కయాదుకు ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి!

# జన నాయగన్ విడుదలకు సిద్ధం



విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.

-----


# అఖిల్ ఈసారి హిట్ పక్కా అంటున్న ఫ్యాన్స్!

అఖిల్ తన కెరియర్ ను మొదలుపెట్టి చాలాకాలమే అయింది. అయితే అఖిల్ పై అభిమానులు పెట్టుకున్న అంచలనాలను గత సినిమాలు అందుకోలేకపోయాయి. అఖిల్ మంచి అందగాడు. డాన్స్ .. ఫైట్స్ లోను అఖిల్ కి వంక బెట్టడానికి లేదు. నటన పరంగా కూడా మంచి మార్కులే సంపాదించుకున్నాడు. అయితే అఖిల్ కి తగిన హిట్ మాత్రం ఇంకా ఆయనను వరించలేదనే చెప్పాలి. ఆ సమయం కోసమే ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖిల్ చేసిన సినిమానే 'లెనిన్'. సూర్యదేవర నాగవంశీ - నాగార్జున కలిసి నిర్మించిన సినిమా ఇది. మురళీ కిశోర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, రేపు థియేటర్లకు రానుంది. ఈ సినిమా నుంచి వదిలిన సాంగ్స్ కీ .. ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అఖిల్ - భాగ్యశ్రీ బోర్సే జోడీ మార్కులు కొట్టేసింది. ఇంతవరకూ అఖిల్ చేసిన పాత్రలకు పూర్తి డిఫరెంట్ గా ఉండే పాత్ర కావడం, ఈ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. రామాపురం - భారతం మిట్ట అనే రెండు గ్రామాల మధ్య నడిచే కథ ఇది. ఆ గ్రామాలకు చెందిన ఇద్దరు ప్రేమికుల చుట్టూ పరిగెత్తే కథ ఇది. గ్రామీణ రాజకీయాలు .. అక్కడ ప్రతి ఏడాది జరిగే జాతర ప్రధానంగా ఈ కథ కొనసాగుతుంది. లవ్ .. యాక్షన్ .. ఎమోషన్స్ ఈ కథలో బలంగా కనిపిస్తున్నాయి. విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో గతంలో నాగార్జున చేసిన సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. అలాగే అఖిల్ కి కూడా ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి పెడుతుందనేది ఫ్యాన్స్ బలంగా చెబుతున్న మాట.



# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన పెద్ది

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'పెద్ది' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, థియేటర్ వెర్షన్ కంటే ఓటీటీలో కొన్ని సీన్స్ యాడ్ చేశారు. రన్‌టైం కారణంగా కట్ చేసిన సన్నివేశాలను, థియేటర్‌లో విడుదలైయ్యాక తొలగించిన సీన్స్‌ను కూడా ఇందులో యాడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. కథేంటంటే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు లేదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేస్తాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి పెద్ది క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తన గ్రామం కోసం పెద్ది ఏం చేశాడు? అన్నదే సినిమా కథ.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613